క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: హైదారాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చిన్నారిని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం పరామర్శించారు. మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కాకా చెన్నారావు కుమార్తె అన్విత బ్రెయిన్ సంబంధిత సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా ఆస్పత్రిలో చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

అదనపు ఎస్సైగా రామ్మూర్తి



అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట అదనపు ఎస్సైగా రామ్మూర్తి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా ఇక్కడ పనిచేస్తున్న పి.శివరామకృష్ణ చంద్రుగొండ ఎస్సైగా బదిలీ కాగా, ఆయన స్థానంలో కొత్తగూడెం సీఎంఎస్ (కోర్టు మానిటరింగ్ సిస్టం) విభాగంలో విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తిని ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన విధుల్లో చేరగా తోటి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ

దమ్మపేట: మండల పరిధిలోని పంచాయతీల్లో 2023–24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు మండల ఈజీఎస్ ఏపీఓ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 818 పనులు జరుగగా ఆ పనులు, వేతనాలకు కలిపి మొత్తంగా రూ.4,76,12,703లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ పనులపై పంచాయతీల పరిధిలో తనిఖీలు చేసి, ఉపాధి హామీ చట్టం, కూలీలకు కల హక్కులు, విధులపై అవగాహన కలిగిస్తారని తెలిపారు.

స్వెటర్ల పంపిణీ



స్వెటర్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని వృద్ధులు, అనాథలకు పరివర్తన యశోద ఫౌండేషన్ సేవా సమితి కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, డాక్టర్ భానుప్రసాద్, సారయ్య, ప్రభాకర్, మారం ఈశ్వర్‌రెడ్డి, జాన్‌కుమార్, అర్జున్, అప్పారావు, రాణి, రమాదేవి, కుమార్, రాజాపెరియార్, మానస, జానకిరామ్, రామకృష్ణ, శ్రీనివాస్, వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అశ్వాపురం: మండల పరిధిలోని ఆరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి చింతిర్యాల గ్రామానికి చెందిన దినసరపు నీలిమ–ప్రభాకర్‌రెడ్డి దంపతులు రూ.4 వేల ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా గురువారం నిర్వాహకురాలు షహనాజ్‌బేగంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, కోలా శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే జీవనభృతి కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కార్మికులకు తక్షణమే జీవనభృతి కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐఎంఎల్–మాస్‌లైన్ ప్రజాపంథా అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు, వేణు, బాడిస లక్ష్మణరావు, అర్జున్, లక్ష్మణరావు, గోవిందు పాల్గొన్నారు.

నియమాలే పరమావధి..

ఏటేటా పెరుగుతున్న అయప్ప మాలధారులు

- 41 రోజులు కఠిన నియమాలతో దీక్షలు
- ఆధ్యాత్మికంతోపాటు ఆరోగ్యం



అయ్యప్పమాల ధరించిన భక్తులు

దుమ్ముగూడెం: నిత్యం వేకువజాము నుంచి అయ్యప్ప స్వామి శరణుఘోషతో గ్రామాలు మేల్కొంటున్నాయి. ఒకప్పుడు కొంతమంది మాత్రమే ధరించే అయ్యప్పమాల ఇప్పుడు ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో ధరిస్తూ కఠిన దీక్షలు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అయ్యప్పమాలధారుల సంఖ్య ఏడాదికేడాది గణనీయంగా పెరుగుతూ ఆధ్యాత్మికతవైపు పయనిస్తుంది. మండల వ్యాప్తంగా అయ్యప్పమాలధారులు సుమారు 200 మంది పైగా ఉన్నారు. దీక్షలు పూర్తి చేసుకుని తమ స్థోమతను బట్టి కేరళ రాష్ట్రంలోని శబరిమలై, ఆంధ్రాలోని ద్వారపూడి, రాజమండ్రి, భద్రాచలంలో గల అయ్యప్ప సన్నిధానంలో ఇరుముడులను అందజేస్తుంటారు. కార్తీకమాసం మొదలైనప్పటి నుంచి సాధారణ భక్తులతో శివాలయాలకు రద్దీ పెరుగుతుండగా అయ్యప్ప మాలధారులు సైతం పెరగడంతో మాలలు వేసుకున్న గ్రామాల్లో ఆధ్యాత్మికత సంతరించుకుంటుంది.

సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది..



41 రోజులు కఠిన నియమాలతో దీక్ష చేయడం, సమయంలోపే ఆహారాన్ని స్వీకరించడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. ఒక్కపూట శాఖాహార భోజనం స్వీకరించడం సమతుల్యత పాటించడంతో జీర్ణక్రియ చక్కబడుతుంది. భక్తి భావం పెరుగుతుంది. ఈ 41 రోజులు కఠిన నియమాలతో చేసిన దీక్షల వలన సంవత్సరాంతం ఇదే ఒరవడి కలిగి ఉండటానికి ఉపయోగపడుతుంది.

– జీరి సత్యనారాయణ, గురుస్వామి

మండల దీక్షతో ఆరోగ్యం..

అయ్యప్ప మండల దీక్షతో (41 రోజులు) ఆధ్యాత్మిక చింతనతో పాటు దురలవాట్లకు దూరమై, సంపూర్ణ ఆరోగ్యం, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుంది. తెల్లవారుజామునే చన్నీటి స్నానం, ఒక్క పూట భోజనం, దేవతారాధన వంటి అలవాట్లు మనిషి జీవితంపై చక్కటి ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం చన్నీటి శిరస్నానాలు చేయడం వల్ల మెదడులోని సున్నిత నరాలు స్పందించి సునిశిత శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం కలగడమే కాకుండా శరీరంలోని వేడి కూడా సమతుల్యమవుతుంది. నుదుటిపై చందనం, కుంకుమ, విభూతి ధరించడం వల్ల భృగు మధ్య భాగంలోని అతి సున్నిత నరాలకు చల్లదనాన్ని ఇవ్వడమే గాక గంధం సువాసన మానసిక ప్రశాంతతనిస్తుంది. వన మూలికలతో తయారయ్యే విభూతి యాంటీబాక్టీరియల్‌గా పనిచేసి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. దీక్షా కాలంలో ధరించే నలుపు రంగు బట్టలు వేడిని గ్రహించి దేహానికి వెచ్చదనాన్ని ఇస్తాయి. కాళ్లకు చెప్పులు ధరించకుండా నడవడంతో భూమిపై ఉండే చిన్న చిన్న రాళ్లు, మట్టి గడ్డలు పాదాలకు సున్నితంగా గుచ్చుకుని ఓ రకంగా ఆక్యూపంక్చర్ చర్య జరిగి నరాలకు స్పందన కలుగుతుందని దాంతో శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుందని వైద్యులు తెలుపుతున్నారు. ఒంటి పూట భోజనం చేయడం వల్ల జీర్ణ వ్యవస్థ క్రమబద్ధీకరించబడుతుంది. అయ్యప్ప దీక్షతో మానసిక, శారీరక ఉత్తేజం కలిగి ఆత్మస్థైర్యం, ఏకాగ్రత పెంపొందుతాయని శాస్త్రాలు తెలుపుతున్నాయి.



నగర సంకీర్తన చేస్తున్న మాలధారులు

‘సికిల్‌సెల్’ నిర్ధారణ పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

భద్రాచలంఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో వారం రోజులుగా ఏడు సబ్ సెంటర్ల పరిధిలో 32 మంది ఆశా కార్యకర్తలు ఇంటింకి తిరిగి ప్రతి ఒక్కరికి సికిల్‌సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా ఇప్పటి వరకు భద్రాచలంలో 3,037 మందికి పరీక్షలు నిర్వహించగా వీరిలో ఐదుగురికి సికిల్‌సెల్ అనీమియా ఉన్నట్లు తెలింది. దీంతో మళ్లీ పరీక్షలు నిర్వహించగా ఇద్దరికే అనీమియా ఉన్నట్లుగా తెలిందని వైద్యాధికారి సుభాష్ తెలిపారు.

లారీ డ్రైవర్‌పై కేసు

భద్రాచలంఅర్బన్: లారీ డ్రైవర్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణం మీదగా సత్తుపల్లి వెళ్తున్న ఒక ఇసుక లారీకి పట్టా కప్పకుండా వెళ్తుండగా వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారులపై ఇసుక పడడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు డ్రైవర్‌పై ర్యాష్ డ్రైవింగ్ కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందుకుంటున్న ఎస్సై

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో లయన్స్‌క్లబ్, పోలీస్, అటవీ శాఖ ఆధ్వర్యంలో పినపాక సబ్ డివిజన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ మేరకు గురువారం అశ్వాపురం పోలీస్‌జట్టు, అశ్వాపురం జట్ల మధ్య మ్యాచ్ జరగగా అశ్వాపురం జట్టు నిర్ణిత ఓవర్లలో 52 పరుగులు చేయగా అనంతరం పోలీస్ జట్టు మూడు వికెట్లు కోల్పోయి 53 పరుగులు చేసి విజయం సాధించారు. 20 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన ఎస్సై తిరుపతిరావుకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందజేశారు.

బాబా ఆలయంలో అన్నదానం



అన్నదాతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మణుగూరు రూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సాయినాథుడి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటన

ములకలపల్లి: మండలపరిధిలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ఇటీవల మృతి చెందిన వారి బాధిత కుటుంబాలను పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, తాండ్ర రాంబాబు, పుష్పాల చందర్‌రావు, గంగవరపు సుధాకర్, భూక్యా ధర్మ, సున్నం సత్యనారాయణ ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ‘ఏకలవ్య’ విద్యార్థులు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఈఎంఆర్‌ఎస్ విద్యార్థులు త్రివేద, కార్తీక్‌లు రాష్ట్రస్థాయి సంగీతం పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ విజేందర్‌సింగ్ గురువారం తెలిపారు. ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో తెలంగాణ గ్రూప్ ఇన్‌స్ట్రుమెంట్‌లో రెండో స్థానం సాధించారు. అదేవిధంగా ఈఎంఆర్‌ఎస్ గాంధారిలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. కబడ్డీలో హాసిక, హాకీలో సాయికిరణ్, సంతోష్, ఫుట్‌బాల్‌లో రాజేష్, వశిష్ట, ఫుట్‌బాల్ గర్ల్స్‌లో కీర్తన, కీర్తి, అనూష, పూజశ్రీలు ప్రతిభ చాటారన్నారు. వీరు డిసెంబర్‌లో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరిగే నేషనల్ స్పోర్ట్స్ క్యాంపులో పాల్గొంటారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నీరజ్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కమిటీల ఎన్నిక

భద్రాచలంటౌన్: బీఆర్‌ఎస్ అనుబంధ మండల కమిటీలను జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండల కన్వీనర్ సునీల్ గురువారం ప్రకటించారు. బీఆర్‌టీయూ కార్మిక విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏడుకొండలు, అనిల్ కుమార్, యువజన విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దానియేలు ప్రదీప్, బాబీ, విద్యార్థి విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా కొల్లిపాక శివ, నానిపల్లి ప్రమోద్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా కాపూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా కాపుల సూరిబాబు, పసుపులేటి రమేష్, బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తుల నర్సింహులు, చారి, సోషల్ మీడియా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా విశ్వనాథ్, రమేష్, కిసాన్ సెల్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా రామకృష్ణ, థామసయ్య, మైనార్టీ విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా అబ్దుల్ ఖాదర్, హిమాం ఖాసీం, ఆటో యూనియన్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా రవికిరణ్, గోపిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేయండి

మణుగూరు రూరల్: ఈ నెల 29న భద్రాద్రి కొత్తగూడెంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగే దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ నవంబర్ 29, 2009లో ఆమరణ నిరాహార దీక్షకు దిగారని రోజును దీక్షా దివస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల, పట్టణ కో కన్వీనర్ బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు, మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, నర్సింహారావు, తురక రామకోటి, సురేష్ పాల్గొన్నారు.

ఫూలే అడుగుజాడల్లో నడవాలి



మణుగూరు రూరల్: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



అశ్వారావుపేటరూరల్: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మణుగూరు రూరల్: సమాజంలో కులవివక్షతను రూపుమాపేందుకు, అంటరానితనంపై, బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు పోరాటం చేసిన మహాత్మా జ్యోతి బాపూలే అడుగుజాడల్లో నడవాలని పలువురు నాయకులు అన్నారు. జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, నాయకులు వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ఆవుల నర్సింహరావు, ఉప్పుతల రామారావు, కలగూర శంకర్, బర్ల సురేష్, ఎస్‌కె హబీబ్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: బీసీ ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రింగ్ రోడ్ సెంటర్లో గల పూలే విగ్రహానికి బీసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం బాధ్యులు అంకోలు వెంకటేశ్వరరావు, ఎస్‌కే.పకీర్, కైలా శ్రీరాములు, దేవరకొండ త్రినాథ్, సర్వానంద గిరిరాజు పాల్గొన్నారు.

ప్రజాపాలన సంబురాలు ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మండలాల అధ్యక్షులు

మణుగూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ అన్ని మండలాల్లో ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ప్రజాభవన్ కార్యాలయంలో ఏడు మండలాల అధ్యక్షులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ... ఏడాది కాలంలో నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రతీ గడపకు తెలిసేలా అందించిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ తెలిసేలా అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించాలని అభిమానులు, కార్యకర్తలు, నాయకులను వేడుకల్లో పాల్గొనేలా చేసి విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులను, కార్యకర్తలను కాపాడుకునే విధంగా పనిచేయాలన్నారు. సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, శివసైదులు, గొడిశాల రామనాథం, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, ఓరుగంటి భిక్షమయ్య, దుగ్గంపూడి కృష్ణారెడ్డి, కొడెం ముత్యమాచారి, పాయం రామనర్సయ్య తదితరులు ఉన్నారు.

భద్రాచలంలో సమీకృత మార్కెట్ నిర్మించాలి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

భద్రాచలం: భద్రాచలంలో సమీకృత మార్కెట్‌ను నియమించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ వినతిపత్రం అందజేశారు. గురువారం హైద్రాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వెంకట్రావ్ కలిశారు. ఈ సందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ... భద్రాచలం వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రమని, భద్రాచలంలో సమీకృత మార్కెట్ లేకపోవడం వలన రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని, మధ్యవర్తుల వలన జరిగే ఆర్థిక నష్టం ఉండదని, వెంటనే నిధులను కేటాయించి నిర్మాణాన్ని వేగవంతంగా చేపట్టాలన్నారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. నాయకులు తాళ్లపల్లి రమేష్ గౌడ్, బుడగం శ్రీను, తోటకూర రవిశంకర్ పాల్గొన్నారు.

‘దుమ్ముగూడెం’ను సందర్శించిన అధికారులు



ఆనకట్ట వద్ద అధికారులు

అశ్వాపురం: మండలపరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో దుమ్ముగూడెం ఆనకట్టను అధికారులు గురువారం సందర్శించారు. ఆనకట్టను, ఆనకట్ట ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం రంగారావు, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎన్నో సాగు, తాగునీటి ప్రాజెక్టులు, భారజల కర్మాగారం, సీతమ్మ సాగర్ బ్యారేజీ, సీతారామ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆధారమైన 150 ఏళ్ల చరిత్ర కలిగిన దుమ్ముగూడెం ఆనకట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భోజన కార్మికుల వేతనాలు పెంచాలి



దమ్మపేట: వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



అశ్వారావుపేటరూరల్: ధర్నా చేస్తున్న కార్మికులు

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచి, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, మండల విద్యావనరుల కేంద్రం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ కీసర లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జ్యోతి, కుమారి, ఈశ్వరమ్మ, సత్యవతి, శ్రీదేవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పిట్టల అర్జున్, నన్ని, నాగదుర్గ, యామిని, సీత రాములమ్మ, రమాదేవి, కనకమహాలక్ష్మీ, యశోద తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 16 17 తేదీల్లో నిర్వహించనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వర్కర్ల యూనియన్ మండల కార్యదర్శి బుగ్గా వెంకటనర్సమ్మ, తేజావత్ క్రాంతి, సంగం అంజమ్మ, పద్దం తిరుపతమ్మ, పొట్టా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



తెల్లం సీతమ్మను సన్మానిస్తున్న ఉద్యోగులు

దుమ్ముగూడెం : భద్రాచలం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియామితులైన తెల్లం సీతమ్మను తహసీల్దార్ అశోక్‌కుమార్ సన్మానించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీతమ్మకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కల్లూరి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలపరిధిలోని జగ్గారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై కారు బైక్ ఢీకొనగా బైక్ నడుపుతున్న కడారి ముత్తయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు ముత్తయ్య ఆస్పత్రికి తరలించారు.

రహదారి పనులకు మోక్షమెప్పుడో?



గ్రావెల్ తోలి వదిలేసిన రామచంద్రాపురం-ఇరవెండి రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం –ఇరవెండి రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగేలా లేదు. రామచంద్రాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుండి ఇరవెండి రోడ్డు వరకు ఐటీడీఏ ఎస్‌టీఎస్‌డీఎఫ్ రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే రేగా శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి రెండేళ్లు కావస్తున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో కొన్ని పనులు చేపట్టారు. రోడ్డు పనులు ప్రారంభించి గ్రావెల్ పోశారు. రహదారికి ఇప్పటికే గ్రావెల్ పోసి నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు చేపట్టడం లేదు. గ్రావెల్ పోసి వదిలేయడంతో రహదారిపై ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ముధూళీ లేస్తుండటంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రహదారి పనులు వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.